క్లుప్తంగా

అల్లర్లు చేస్తే చర్యలు తప్పవు


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ నబీరసూల్

బొమ్మనహాళ్: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, అల్లర్లు చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ నబీరసూల్ అన్నారు. ఆదివారం మండలంలోని కొలగానహళ్లికి చెందిన 30 మంది ఇటీవల మైలాపురంలో ఓ ఇంటిపై దాడి కేసులో కండీషన్ బెయిల్‌పై వచ్చిన వారికి ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి గ్రామాల్లో అల్లర్లకు పాల్పడిన వారి బెయిల్ రద్దు చేయిస్తామని హెచ్చరించారు. ప్రతి ఆదివారం స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టి వెళ్లాలని అన్నారు. గ్రామాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చ చేయకూడదన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ నవీన్‌కుమార్, ఏఎస్ఐ హనుమంతరెడ్డి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి


దొణస్వామి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దొణస్వామి (44) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ, పీఏసీ సభ్యుడు డాక్టర్ తలారి రంగయ్య, నాయకులు దొణస్వామి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సాను భూతి తెలియజేశారు. కంబదూరు జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, మండల కన్వీనర్లు గొల్ల సూరి, జి.హనుమంతరాయుడు, ఎంపీపీ ఆంజనేయు లు, నాయకులు రామచంద్ర, బిక్కిహరి, వేపులపర్తి మంజు, మల్లికార్జున, శీనా, పాండు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు


నాగమణి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: ఉద్యోగులకు విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తుండిపోతాయని అధికారులు అన్నారు. ఆదివారం మండలంలోని ఉడేగోళం గ్రామంలోని మద్దానేశ్వరస్వామి కళ్యాణ మంటపంలో ఉద్యోగ విరమణ చేసిన ఎంఈఓ ఎస్.నాగమణి దంపతులను సన్మానించారు. ఎంఈఓ-2 వెంకటరమేష్ అధ్యక్షన జరిగిన సభకు ఎంపీడీఓ కొండన్న, విద్యాధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పదని, విధి నిర్వహణలో మనం ప్రజలకు అందించే సేవలే నిలిచిపోతాయని అన్నారు. రాయదుర్గంలో 13 ఏళ్ల పాటు ఎంఈఓగా నాగమణి సేవలందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, విద్యాశాఖ సిబ్బంది హాజరయ్యారు.

ప్రభుత్వం బకాయి చెల్లించాలి


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌనిపాతిరెడ్డి తదితరులు

ఉరవకొండ: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్లకు కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గౌనిపాతిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మాట్లాడారు. ప్రభుత్వం బకాయిపడిన నాలుగు డీఏలను వెంటనే విడుదల చేసి, పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిషన్ ఆలస్యమైతే 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. గతేడాది 10వ తరగతి ప్రత్యేక తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ఆహ్వానితులు నారాయణస్వామి, పూర్వ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ధనుంజయ, ఓబన్న, శ్రీనివాసులు, నజీర్ అహ్మద్, వెంకటేసులు, చంద్రశేఖర్, సాకే ముని స్వామి, కృష్ణ, రఘురాములు, లింగమూర్తి, రామాంజనేయులు, శ్రీనివాసులు, దేవేంద్ర పాల్గొన్నారు.

నీలగిరిస్వామికి పూజలు



వజ్రకరూరు: స్థానిక కురుబ వీధిలో భక్తుల కొంగుబంగారం నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ఆకుపూజ, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు.


కూడేరు జగనన్న కాలనీ నుంచి గణేష్ ప్రతిమను తరలిస్తున్న దృశ్యం


రాయదుర్గం: ఉత్సాహంగా వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న చిన్నారులు, యువత


రాయదుర్గం నాన్ చెరువులో వినాయక విగ్రహాలను గంగ ఒడికి చేరుస్తున్న యువత


కూడేరు: కడదరగుంటలో వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

గంగ ఒడికి గౌరీపుత్రుడు

- ఉత్సాహంగా వినాయక ప్రతిమల ఊరేగింపు
- నిమజ్జనానికి తరలివెళ్లిన గణనాథులు


రాయదుర్గంలో గంగమ్మబావి వినాయకుడి ఊరేగింపునకు భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథుల నిమజ్జన శోభయాత్ర ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. పట్టణంలో 40కిపైగా వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలపై గణనాథులను పట్టణంలో ఊరేగింపు చేశారు. చిన్న విగ్రహాలను పట్టణ సమీపంలోని మొలకాల్మూర్రు చెక్‌పోస్టు వద్దనున్న నాన్ చెరువులో నిమజ్జనం చేయగా భారీ విగ్రహాలను కణేకల్లులోని హెచ్చెల్సీ కెనాల్‌కు తరలించారు.

వినాయక లడ్డూ వేలం

వినాయక సర్కిల్ వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన స్వామి లడ్డూ వేలం పాటలో వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప రూ. 50,116లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో వినాయక సర్కిల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కూడేరులో ఉత్సాహంగా నిమజ్జనం

కూడేరు: మండలంలోని కడదరకుంట, జల్లిపల్లి, కూడేరు, కొర్రకోడు, ముద్దలాపురం, కరుట్లపల్లి, కమ్మూరుతో పాటు మరికొన్ని గ్రామాల్లో వినాయక ప్రతిమలను నిమజ్జనానికి ఆదివారం తరలించారు. జోరుగా వర్షం పడుతున్నా ప్రజలు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా వినాయక ప్రతిమలను తీసుకెళ్లారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు

ఉరవకొండ: పట్టణంలోని ప్రధాన కూడళ్లలో కొలువు తీరిన భారీ గణనాథులను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని 70 గణనాథులు భారీ ఊరేగింపు నడుమ నిమజ్జనానికి తరలివెళ్లాయి. మేళాతాళాల మధ్య నిర్వాహకులు నృత్యాలు చేస్తూ వినాయక ప్రతిమలను తీసుకెళ్లి హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువల్లో నిమజ్జనం చేశారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

రూ.70 వేలు పలికిన వినాయక లడ్డూ..:

స్థానిక రంగా వీధిలో కాణిపాక వరసిద్ధి వినాయక ఉత్సవ సమితి లడ్డూ వేలం వేయగా, రూ.70 వేలకు గోల్డ్‌షాపు నిర్వాహకులు బబ్లూ దక్కించుకున్నాడు. స్వామి వారి వెండి గొలుసు, ఉంగరం రూ.18,516, వెండికిరీటాన్ని కొమ్మసాని మల్లికార్జున రూ.15 వేలు, శాలువను నవీన్ రూ.11 వేలు, కండువా బత్తల కిరణ్, చంద్రలు రూ.4 వేలకు దక్కించుకున్నారు.

వినాయక... సెలవిక

కణేకల్లు: మండల కేంద్రంలో ఆదివారం వినాయక నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఐదురోజులపాటు దేవమ్మ గుడి, చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయం, రామనగర్, దిగువవీధి తదితర ప్రాంతాల్లో పూజలందుకున్న వినాయక ప్రతిమలను భక్తులు ట్రాక్టర్లలో ఊరేగించారు. కణేకల్లు మెయిన్‌రోడ్డులో వినాయకులను ఊరేగించిన అనంతరం రామనగర్‌లోని హెచ్చెల్సీ కాలువలో నిమజ్జనం చేశారు. ఊరేగింపు వేడుకల్లో ఎస్ఐ నాగమధు, ఏఎస్ఐ ఈశ్వర్‌రెడ్డితోపాటు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బెళుగుప్ప: మండల పరిధిలోని బెళుగుప్ప తండా, ఆవులెన్న, వెంకటాద్రిపల్లి గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులు ఆదివారం నిమజ్జనానికి తరలివెళ్లారు. బెళుగుప్ప తండాలో నిమజ్జనంలో భాగంగా లడ్డూ వేలం పాటను ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ ఎస్.భీమానాయక్ రూ.10 వేలకు దక్కించుకున్నాడు. ఆవులెన్న, వెంటాద్రిపల్లి గ్రామాల్లో గణనాథులను ట్రాక్టర్లలో ఊరేగిస్తూ ఘనంగా నిమజ్జనం చేశారు. ఎస్ఐ శివ, ఏఎస్ఏ రామదాసు సిబ్బందితో కలసి పర్యవేక్షించారు.


కణేకల్లులో సర్వకోటి వినాయకున్ని ఊరేగిస్తున్న దృశ్యం


రాయదుర్గంలో వేలంలో లడ్డూను దక్కించుకున్న పొరాళ్ల శివకుమార్


కూడేరు: శ్రీనివాసరావు కాలనీ నుంచి నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


ఉరవకొండలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు


ఉరవకొండ: కాణిపాక వరసిద్ధి వినాయక లడ్డూ దక్కించుకున్న భక్తుడిని సన్మానిస్తున్న దృశ్యం


ఉరవకొండలో వినాయక నిమజ్జన ఊరేగింపులో నృత్యం చేస్తున్న యువకులు


బెళుగుప్ప తండాలో వినాయక ఉత్సవంలో లడ్డూ వేలం పాట


కణేకల్లులో వినాయకున్ని ఊరేగిస్తున్న దృశ్యం


బెళుగుప్ప తండాలో గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


రాయదుర్గంలో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలుతున్న భారీ వినాయకుడు

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- సోషల్ మీడియా కన్వీనర్లకు సమన్వయకర్త మెట్టు ఆదేశం


మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: సోషల్ మీడియా కన్వీనర్లకు ఎలాంటి కష్టమొచ్చినా పార్టీతోపాటు తాను కూడా అండగా ఉంటానని, కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి సూచించారు. వైఎస్ జగన్ నమ్మకాన్ని నిలబెట్టేలా మరింత బలంగా సోషల్ మీడియా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులో గుర్తింపు లభిస్తుందన్నారు. ఆదివారం స్థానిక మెట్టు క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ అసమర్థ, ప్రజా వ్యతిరేక, పాలనలో విఫలమైన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే సోషల్ మీడియా పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. కూటమి సూపర్ సిక్స్ పాలన కాదు..సూపర్ ఫెయిల్ పాలన అన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో పెద్ద పీట వేశారన్నా రు. సోషల్ మీడియా కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చి అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. సోషల్ మీడియాను కాపాడుకునేందుకు వైఎస్ జగన్ ప్రత్యేక లీగల్ టీములు, టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ రవీంద్రరెడ్డి, కో కన్వీనర్ వంశీ, జిల్లా సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి నుంకేష్, రాయదుర్గం పట్టణ, కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట సోషల్ మీడియా కన్వీనర్లు అల్తాఫ్, శివయ్య, రమేష్, హనుమంతరెడ్డి, మండల కన్వీ నర్లు రామాంజనేయులు, రవీంద్రరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామాల్లో మారెమ్మ జాతర

కుందుర్పి: మండలంలోని 8 గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో మారెమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల సర్పంచులు ప్రభాకర్, ఓబన్న, బొమ్మయ్య తదితరులు తెలిపారు. మలయనూరు, వడ్డేపాళ్యం, శ్రీమజ్జనపల్లి, నాగేపల్లి, శీగలపల్లి, నిజవళ్లి, మాయదార్లపల్లి, బీ.కొత్తూరు తదితర గ్రామాల్లో జాతర జరగనుంది. మంగళవారం గ్రామాల్లో గ్రామోత్సవాలు, మహా మంగళహారతులు, బుధవారం గ్రామశాంతి, అమ్మవారి విగ్రహాల ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయి.

కాపర్ వైరు అపహరణ


దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

కణేకల్లు: మండలంలోని గంగలాపురంలో శనివారం అర్ధరాత్రి దుండగులు రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులోని కాపర్‌ను అపహరించారు. శివారులో ఉన్న వ్యవసాయ పొలంలో నరసింహులు, వెంకటేశులు, మంజునాథ్ అనే రైతులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గు ర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, అందులోని కాపర్‌ను ఎత్తుకెళ్లారు. 20 కేజీల కాపర్ ఉంటుందని బాధితులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


గొల్ల నరసింహులు(ఫైల్)

శెట్టూరు: కనుకూరుకు చెందిన గొల్ల నరసింహులు (54) ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మోటారు మెకానిక్ అయిన నరసింహులు జూన్ నెల 28న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులు తొలగిస్తూ విద్యుత్ షాక్‌కు గురైన విషయం తెలిసిందే. అయితే రెండు నెలలుగా కర్నూల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య మల్లక్క, ఒక కుమార్తె ఉన్నారు.

రాష్ట్ర స్థాయి నాటక పోటీలకు లక్ష్మంపల్లి వాసి


నల్లప్ప

కుందుర్పి: జిల్లా కేంద్రంలోని కృష్ణ కళామందిరంలో ఈనెల 5 నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి నాటక పోటీలకు శెట్టూరు మండలం లక్ష్మంపల్లికి చెందిన బోయపాటి నల్లప్ప ఎంపికైనట్లు జిల్లా కళాకారుల సంఘం నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలనాగమ్మ నాటకంలోని మాయల ఫకీరుగా నల్లప్ప ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు.

ఇళ్ల లబ్ధిదారులపై ఎందుకంత కక్ష?

రాయదుర్గంటౌన్: ఇందిరమ్మ కాలనీల్లో లబ్ధిదారులపై ఎందుకంత కక్ష అని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ సాధారణ సమావేశంలో నిలదీశారు. 15 ఏళ్ల క్రితం మంజూరైన ఇందిరమ్మ కాలనీల్లోని లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని తరుచూ నోటీసులు జారీ చేస్తూ, వారిని తీవ్ర ఆందోళనకు గురి చేయడం సరికాదన్నారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత సమావేశంలో అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. అనంతరం అజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జరిగిన జీరో అవర్స్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నోటీసులు జారీ, సీజనల్ వ్యాధులు, శానిటేషన్, డివైడర్లు, తదితర అంశాలపై కౌన్సిలర్లు పలు ప్రశ్నలు లేవనెత్తారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పట్టణంలో సరైన పారిశుద్ధ్యం మెరుగు పరిచే పనులు జరగ లేదని పలువురు కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, బండి అజయ్, కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసులు, కౌన్సిలర్లు గౌని లావణ్య, ప్రశాంతి మాట్లాడారు. పట్టణంలో అధికమవుతున్న కుక్కలు, పందుల బెడదను నివారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ సురేష్, టీపీఎస్ మురళీమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ’

కళ్యాణదుర్గం రూరల్:మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ కన్వీనర్ సుధీర్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ హాజరవుతారన్నారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలి

వజ్రకరూరు: మండలంలోని రైతులు తప్పనిసరిగా పంటల నమోదు చేసుకోవాలని ఏఓ మధుకర్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగతోపాటు కంది, ఆముదం, మొక్కజొన్న, సజ్జ, పత్తి తదితర పంటలు సాగు చేసినట్లు తెలిపారు. రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంటల నమోదుతోనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏఓ తెలియజేశారు.

వినాయకుడి విగ్రహం తొలగిస్తే ఉద్యమిస్తాం

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ డిపోలో కొన్నేళ్లుగా ఉన్న వినాయకుడి మంటపం, విగ్రహాన్ని తొలగించేందుకు ప్రయత్నం చేస్తే ఉద్యమం చేస్తామని వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్, రాయదుర్గం శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు.

రేపు వైఎస్సార్ వర్ధంతి

కూడేరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతి వేడుకలు ఈ నెల 2న ఉదయం 9:30 గంటలకు నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, నేతలు, అనుబంధ విభాగాల నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

రోడ్డు కోత..ప్రజలకు తప్పని వెత


కల్లుదేవనహాళ్లి వద్ద కోతకు గురైన సింగానహాళ్లి రోడ్డు

బొమ్మనహాళ్: కల్లుదేవనహాళ్లి నుంచి సంగమేశ్వరాలయం మీదుగా సింగానహాళ్లికి వెళ్లే రోడ్డు మూడేళ్ల కిందట వేదావతి హగరి నది వరదకు కోతకు గురైంది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారికి నేటికీ కనీస మరమ్మతులు కూడా చేయలేదు. గతేడాది అక్టోబర్, నవంబర్‌లో వేదవతి హగరి నది ఉధృతికి కల్లుదేవనహాళ్లి వద్ద ఒడ్డు, శింగానహాళ్లి గ్రామానికి వెళ్లే రోడ్డు మరింత భారీగా కోతకు గురైంది. దీంతో సింగానహాళ్లి, బెణకల్లు, గోనేహాళ్, శ్రీధరఘట్ట, బ్రహ్మసముద్రం గ్రామాలకు వెళ్లే ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిత్యం నది గుండా ఇసుకలో రాకపోకలతో అవస్థలు పడుతున్నారు. సింగానహాళ్లి ప్రజలు ఉరవకొండ, బొమ్మనహాళ్, బళ్లారి, అనంతపురం, గుంతకల్లు వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు.

భారీ వర్షంతో కుంటలు, చెరువులకు జలకళ



వజ్రకరూరులో పారుతున్న వర్షపునీరు, కూడేరులో కురుస్తున్న వర్షం

వజ్రకరూరు: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రారంభమైన వర్షం రాత్రి వరకు కొనసాగింది. మోస్తరు వర్షం కురవడంతో గ్రామంలోని కాలనీలన్నీ నీట మునిగాయి. గ్రామంలోని కాలనీల నుంచి వర్షపునీరు మెయిన్‌రోడ్ మీదుగా చెట్టుకుంటవైపు పరుగులు తీశాయి. ఇటీవల కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తుడటంతో గ్రామంలోని కుంటలు, బావులు వర్షపునీటితో నిండాయి.

కూడేరులో మోస్తరు వర్షం

కూడేరు: మండలంలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. కొద్ది రోజులుగా మేఘాలు ఊరిస్తున్నా వర్షం ఆశించిన స్థాయిలో కురవలేదు. వర్షం వస్తే సాగైన వేరుశనగ, ఆముదం, కంది పంటలు కళకళలాడతాయి. ఆదివారం కురిసిన వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.